క్లుప్తంగా

బాధితురాలికి ఆర్థికసాయం



అటెండర్ అర్చనకు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్: పట్టణంలోని పద్మావతీ కాలనీలో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాలుడికి గురువారం ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తున్న అర్చన కుమారుడికి అపెండెక్స్‌తో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. చికిత్స నిమిత్తం హెచ్‌ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు ఆపరేషన్ ఖర్చులు, మందుల నిమిత్తం రూ.30,500లు ఆర్థికసాయం అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కొందుర్గు: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను గురువారం ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అందజేశారు. కొందుర్గుకు చెందిన మంజులతో పాటు శ్రీరంగాపూర్‌కు చెందిన పి.సత్యనారాయణకు ఆయన చెక్కులు అందజేశారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లకు చెందిన అనారోగ్యంతో బాధపడుతుండటంతో మెరుగైన చికిత్స కోసం రూ.2లక్షల ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు



ఎంపీ బలరాం నాయక్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండలంలోని చెందిప్ప గ్రామంలో గల 11వ శతాబ్దపు మరకత శివాలయంలో గురువారం మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎంపీకి జ్ఞాపిక, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు సదానందం, సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

శంకర్‌పల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్‌ను గురువారం పట్టణ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్, మండల కార్యవర్గ సభ్యులు ఆయనను శాలువా కప్పి సన్మానించారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాలు, వార్డుల్లో తిరిగి పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో ఉన్న చిన్నారులతో ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలో గల కృష్ణవేణి పాఠశాలలో ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. విద్యార్థులు ఉట్లు కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

షాబాద్: సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 19 నుంచి 22 వరకు మేడ్చెల్ జిల్లా షాపూర్‌నగర్‌లో మహాసభలు జరుగుతాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీశైలం, సత్తిరెడ్డి, మహిళా మంజుల, నాయకులు తదితరులు ఉన్నారు.

దంచికొట్టిన వాన



షాద్‌నగర్‌రూరల్: నాగులపల్లి వాగు వద్ద పహరా కాస్తున్న పోలీసులు

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- దెబ్బతిన్న పత్తి, వరి, కూరగాయల పంటలు
- ఆందోళనలో రైతులు



చేవెళ్ల: దేవరంపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీవాగు



షాబాద్: తిమ్మారెడ్డిగూడ వద్ద ఈసీవాగు పొంగిపొర్లడంతో నీట మునిగిన పంటలు



షాబాద్: షాబాద్‌లో వర్షానికి కూలిన ఇల్లు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వాన దంచి కొట్టింది. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో వాగులు ఉప్పొంగి కాజ్‌వేలపై నుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు వాగుల వద్దకు వెళ్లకుండా అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మండలంలోని నందిగామ మండలంలోని అకమ్మ చెరువు ఉధృతికి వరి, కూరగాయల పంటలు నీట మునిగాయి. పంట చేను కనపడని విధంగా చెరువుగా మారిపోయింది. షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, చందనవెల్లి, హైతాబాద్, తాళ్లపల్లి ఈసీ వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కురుస్తున్న వర్షాలకు షాబాద్‌లో ఓ ఇల్లు కూలిపోయింది. దాదాపు ఐదు వందల ఎకరాల్లో వరి, పత్తి, పంటలు పూర్తిగా నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. పంటల నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



షాబాద్: ఏట్లఎర్రవల్లిలో ఈసీ వాగు ప్రవహించడంతో దెబ్బతిన్న పత్తి పంట



షాబాద్: ఏట్లఎర్రవల్లిలో నీట మునిగిన వరి పంట



కొందుర్గు: చేగిరెడ్డి ఘణాపూర్ వద్ద కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న అధికారులు



కొత్తూరు: అలుగు పారుతున్న రామయ్య చెరువు



కేశంపేట: పాటిగడ్డ వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ అజాంఅలీ



నందిగామ: నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లే రహదారిని మూసివేసిన అధికారులు



షాద్‌నగర్‌రూరల్: అలుగు పారుతున్న గంపల చెరువు



కొందుర్గు: అలుగు పారుతున్న గుర్రంపల్లి చెరువు



నందిగామ: వీర్లపల్లి శివారులో చెరువు ఉధృతికి నీట మునిగిన వరిపంటలు

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'



శంకర్‌పల్లిలో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు, విద్యార్థులు

శంకర్‌పల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పట్టణ బీజేపీ నేతల ఆధ్వర్యంలో గురువారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించగా.. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, శ్రేణులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలంతా ఒక్కటే అని, ప్రతి ఒక్కరూ స్వాతంత్య్రం కోసం పోరాడిన వీరులను నిరంతరం గుర్తుచేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్, మండల అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, లీలావతి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, ప్రతాప్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న నేతలు

ఐక్యతతో దేశభక్తిని చాటుదాం

షాద్‌నగర్‌రూరల్: దేశంలోని ప్రజలందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చి దేశభక్తిని చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశాల మేరకు గురువారం తిరంగా ర్యాలీ ఇన్‌చార్జి చెట్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ అధ్యక్షతన హర్‌ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మెయిన్‌రోడ్డులో గల దుకాణాల్లో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు సురేష్, అశోక్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

షాద్‌నగర్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడకు చెందిన ఎండీ ఫకీర్‌పాషా గత కొంతకాలం అనారోగ్యంతో గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో బాధితుడిది నిరుపేద కుటుంబం కావడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి కృషితో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.5లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. దీనికి సంబంధించిన పత్రాన్ని గురువారం గ్రామ నాయకులు సురేష్‌గౌడ్, శ్రీధర్ బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అవయవదానం కొత్త జీవితాన్ని ఇస్తుంది

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె

షాద్‌నగర్‌రూరల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు మనం చేసే అవయదానం వారికి కొత్త జీవితాన్ని ఇస్తుందని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రెడ్ రిబ్బన్‌క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అవయవాలను దానం చేయడం ఇతరులకు కొత్త జీవితాన్ని ప్రసాదించే గొప్ప అవకాశమన్నారు. కొందరు రోడ్డు ప్రమాదాల్లో, అనారోగ్యంతో జీవచ్ఛవంలా మారుతారని, అలాంటి వారికి అవయవాలు దానం చేయడంతో మరణం తర్వాత దాతల కుటుంబ సభ్యులు ఓదార్పును పొందుతారన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులలో సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు శ్రీలత, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సీసీకెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

ఏసీపీ లక్ష్మీనారాయణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను కట్టడి చేయొచ్చని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్‌లో కాంగ్రెస్ నేత రాయికల్ శ్రీనివాస్ తన సొంత నిధులు రూ.2లక్షలతో గ్రామంలో సీసీకెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ కెమెరాలను గురువారం ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలను నియంత్రించడంలో కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. రాయికల్ గ్రామం జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో రద్దీగా ఉంటుందని, గ్రామంలో భద్రతా చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సీఐ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ ఆశన్నగౌడ్, దిద్దుల కృష్ణయ్య, పాండు నాయక్, నాయకులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధితో లాభాలు

పశువైద్య విశ్వవిద్యాలయం రిటైర్డ్ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి

షాబాద్: పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే రైతులకు మంచి లాభాలు వస్తాయని పశువైద్య విశ్వవిద్యాలయం రిటైర్డ్ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కక్కులూర్ గ్రామంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో జిల్లా శాస్త్రీయ పద్ధతుల డెయిరీ సాగు, పాల ఉత్పత్తుల విలువల జోడింపుపై మహిళలకు, యువకులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పెంపకం, పాల పదార్థాల తయారీపై పాడి రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఫార్మర్ డీన్ ప్రొఫెసర్ రఘునందన్ పశుపోషణ, షెడ్ నిర్మాణం, తక్కువ లాభాలు వంటి అంశాలపై వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా చేయగల మజ్జిగ, నెయ్యి, క్రీమ్ తయారీపై ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. పాల ఉత్పత్తుల తయారీపై వర్క్‌షాప్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో సుగుణమాల షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి, మహిళా పాడి రైతులు ఉన్నారు.

వర్షపునీరు వెళ్లేందుకు చర్యలు

కేశంపేట: మండల కేంద్రంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో వాహనదారులు, విద్యుత్ సిబ్బంది రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యెన్నం శ్రీధర్‌రెడ్డి ఆర్అండ్‌బీ ఈఈ రవీంద్రకుమార్, ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్యలతో కలసి వర్షపునీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించారు. నీరు వెళ్లేందుకు అనువుగా గతంలో ఉన్న కల్వర్టును పునరుద్ధరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మఠం చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యావతిదేవి, కారోబార్ రవి, కోడిపర్తి శ్రీకాంత్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థులకు దాతల సహకారం

కేశంపేట: విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు దాతలు అందించే సహాయంతో చదువుల్లో ఉన్నతంగా ఎదగాలని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కానంప్రేమ్‌కుమార్‌గౌడ్ ఆర్థికసాయంతో 150 విద్యార్థులకు గుర్తింపు కార్డులు, టై, బెల్టులు అందజేశారు. అదేవిధంగా దత్తాయపల్లిలో గ్రామస్తులు భాస్కర్‌గౌడ్, కానుగ రవి సాయంతో 25 మంది విద్యార్థులకు టై, బెల్టు, షూస్, గుర్తింపు కార్డులను అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ పాల్గొని దాతలతో కలిసి విద్యార్థులకు టై, బెల్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చక్రధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అభివృద్ధి సాధించాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడలో బీసీసేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం బీసీసేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీసేన గ్రామ అధ్యక్షుడిగా మద్దూరు హరీష్, ఉపాధ్యక్షుడిగా గుత్తి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడిగా గుత్తి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా దాసరి గంగాధర్‌గౌడ్ను నియమించి నియామకపత్రాలు అందజేశారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మాజీ సర్పంచ్ మద్దూరు పాండు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుత్తి రామస్వామి, నాయకులు ఆనంద్, కుమార్, మల్లేష్, మహేందర్, ఆనంద్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను దాతలు ప్రోత్సహించడం అభినందనీయమని హెచ్‌ఎం రఘునాథ్ అన్నారు. మున్సిపాలిటీలోని పెద్దమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు గురువారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాటి జగన్‌మోహన్‌రెడ్డి షూ, సాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి
- ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వాగు, నాగులపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆయన వాగుల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి రక్షణ చర్యలను చేపట్టారు. అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించి వాగుల మీదుగా రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున.. అత్యవసర సమయాల్లో తప్పా ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సూచించారు. వాగులు, చెరువుల పరిసర ప్రాంతాలలోకి ప్రజలు రావొద్దని సూచించారు. అత్యవసర సమాచారం కోసం మండల పరిషత్ కార్యాలయంలో 24 గంటలు కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాలలో 8686793747, 9441947364 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, ముజఫర్నిసా భేగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నందిగామలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నందిగామ: భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల కేంద్రమైన నందిగామలోని తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు గురువారం తహసీల్దారు రాజేశ్వర్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం, జంతు నష్టం తదితర సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే గ్రామస్తులు, లేదా బాధితులు తహసీల్దారు కార్యాలయంలో ఫోన్ నం.8019884605, 9866023923లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



అయ్యవారిపల్లి వాగు వద్ద పరిస్థితిని తెలుసుకుంటున్న ఎంపీడీఓ బన్సీలాల్

మూడురోజుల పాటు అందుబాటులో..

కేశంపేట: వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో కంట్రోల్ రూంను తహసీల్దార్ అజాంఅలీ ఏర్పాటు చేశారు. శుక్రవారం సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్ (7799363553), శివ జూనియర్ అసిస్టెంట్ (9398094490), శనివారం గిర్దావర్ చెన్నకేశవులు (9948044523), రికార్డు అసిస్టెంట్ జంగయ్య (9912170411), ఆదివారం జూనియర్ అసిస్టెంట్ మహేశ్ (9441579527), జూనియర్ అసిస్టెంట్ జంగేశ్ (9848206029)లు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.